## క్లుప్తంగా

### వీఆర్‌ఓకు అవార్డు



కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వీఆర్‌ఓ రవికుమార్

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం గ్రామ రెవెన్యూ అధికారి డి. రవికుమార్ జాతీయ పౌరసేవలు దినోత్సవం–2023 సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి చేతులు మీదుగా ఉత్తమ అధికారిగా శుక్రవారం అవార్డు అందుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, ఆర్డీఓ సూర్యకళ, తదితరులు వున్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల చింతపల్లి, వెంపడాం గ్రామాలకు చెందిన వ్యవసాయ విద్యుత్ ఫీడర్లకు శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### సంతాన లక్ష్మికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లోని శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో సంతాన లక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతాభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యాశాఖాధికారుల సస్పెన్షన్ అన్యాయం

విజయనగరం ఫూల్‌బాగ్: పార్వతీపురం – మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీఓ రమణ, వీరఘట్టం ఎంఈఓ పి. కృష్ణమూర్తి, సమగ్రశిక్ష ఏసీడీఓ రోజారమణి, కేజీబీవీ ప్రిన్సిపాల్ రోహిణిలను ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ సస్పెండ్ చేయడం చాలా దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు విజయనగరం ఆపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇజ్జిరోతు రామునాయుడు, వీవీజే సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న చిన్న తప్పులను సరిదిద్దుకోవడానికి అవకాశం ఇవ్వాలే తప్ప, సస్పెన్షన్‌లు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ రేట్లు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు.

### నేడు, రేపు ఎస్‌బీఐ సాంస్కృతిక క్రీడోత్సవాలు

విజయనగరం అర్బన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వార్షిక సాహితీ సాంస్కృతిక క్రీడోత్సవాలను జిల్లా కేంద్రంలో ఈ నెల 22,23 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయం అధికారి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజున స్థానిక రాజీవ్‌గాంధీ ఫుట్‌బాల్ స్టేడియం, షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ కోర్టులో క్రీడా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు స్థానిక గురజాడ కళాభారతి, టీటీడీ కల్యాణ మంటపంలో సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 23న క్యారమ్స్, టీటీ, చెస్, క్విజ్, పద్యపఠన, డ్రాయింగ్, తదితర పోటీలను నిర్వహిస్తామన్నారు. అదే రోజున స్థానిక గురజాడ కళాభారతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 94900 32710 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

### టిడ్కో ఇళ్లు అప్పగించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: బొగ్గులదిబ్బ దళితులకు టిడ్కో ఇళ్లు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

### త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



రావాడలోని జగనన్న కాలనీలో పర్యటిస్తున్న ఎంపీడీఓ దాసరి బంగారయ్య, తదితరులు

భోగాపురం: జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరిగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ దాసరి బంగారయ్య సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబుతో కలిసి మండలంలోని రావాడ పంచాయతీ జగనన్న కాలనీలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయం, నిర్మాణ సామాగ్రితో నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు అండగా..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 2027 మందికి రూ.2.70 కోట్ల విలువైన పరికరాల అందజేతకు చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



కార్యక్రమానికి హాజరైన విభిన్న ప్రతిభావంతులు, వారి తల్లిదండ్రులు

విజయనగరం: విభిన్న ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వాలు ఉంటాయని.. వారికి భరోసా ఇచ్చేందుకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఉపకరణాల పంపిణీ, గుర్తింపు శిబిరాలు దోహదం చేస్తాయని స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, అలిమ్ కో (హైదరాబాద్) ఆధ్వర్యంలో విజయనగరం నియోజకవర్గ స్థాయి ఉచిత ఉపకరణాల పంపిణీ, గుర్తింపు శిబిరం శుక్రవారం స్థానిక కంటోన్మెంట్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల దివ్యాంగులతో కాసేపు మాట్లాడారు. అర్హులైన వారికి విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా మంజూరైన మూడు చక్రాల స్కూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్న ఉద్దేశంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ గుర్తింపు శిబిరాలు నిర్వహించి అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా ఉపకరణాలు అందించనున్నాయని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే ఆరు నియోజకవర్గాల్లో ఈ శిబిరాలు పూర్తయ్యాయని వీటి ద్వారా 2027 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.2.70 కోట్ల విలువైన 3178 పరికరాలు, ఉపకరణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరైన వారికి పంచముఖ ఆంజనేయ అన్నదాన ట్రస్టు భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నగర మేయర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతులు తమ దైనందిన పనులను సొంతంగా చేసుకునేందుకు ఉపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ రేవతీదేవి, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు జగదీష్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, తహసీల్దార్ బంగార్రాజు, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహీం, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి మూడు చక్రాల స్కూటర్ అందిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల



ఒకరికొకరు తోడుగా వచ్చిన దివ్యాంగులు

# సమాజం బాగుండాలన్నదే జగనన్న ఆశయం

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ డీవీజీ శంకరరావు



స్టిక్కర్‌ను స్వయంగా తన ఇంటి గోడకు అతికిస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం: రాజకీయాలకు అతీతంగా సమాజం బాగుపడాలంటే ఆ స్థాయిలోనే ఆలోచనలు ఉండాలని.. ఆ దిశగా అడుగులేస్తున్న ఒకే ఒక వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డేనని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ డీవీజీ శంకరరావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా విజయనగరంలో గృహసారథులు తీసుకువచ్చిన స్టిక్కర్‌ను స్వయంగా తన ఇంటికి గోడకు అతికించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా సాగుతోందని చెప్పారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాల అమలులో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయని చెప్పారు. ఎటువంటి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, రెండు లక్షల కోట్ల రూపాయలు నేరుగా లబ్ధిదారులకు చేరడమే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలకు గ్లాసుల సరఫరా



ప్రభుత్వం సరఫరా చేసిన గ్లాసులు

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకానికి సంబంధించి ప్రభుత్వం గ్లాసులు సరఫరా చేసింది. గత నెల నుంచి విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన గ్లాసులు ఆయా పాఠశాలలకు చేరాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలోని 260 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 26,500 మంది విద్యార్థులు జగనన్న గోరుముద్దను తింటున్నారు. వారందరికీ అందజేయడానికి నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన ఎమ్మార్సీ కార్యాలయాలకు గ్లాసులు శుక్రవారం చేరుకున్నాయని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు తెలిపారు.

# నగర అభివృద్ధిలో కోలగట్ల కృషి అమోఘం



కామాక్షినగర్‌లో నూతనంగా నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తున్న కోలగట్ల, మేయర్, తదితరులు

- వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు
- నగరంలోని 46వ డివిజన్‌లో రూ.16.50 లక్షలతో నిర్మించిన రోడ్డు ప్రారంభం

విజయనగరం: నగర అభివృద్ధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి మరువరానిదని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు కొనియాడారు. నగరంలోని 46వ డివిజన్ కామాక్షినగర్ పైడిమాంబ కాలనీలో రూ. 16.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఇసరాపు రేవతీదేవి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కాపు సామాజిక భవనాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ, నగర అభివృద్ధికి చిరునామాగా కోలగట్ల వీరభద్రస్వామి నిలుస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వెనువెంటనే పరిష్కరించడంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. కామాక్షినగర్‌లో ఉన్న వెలమ సంక్షేమ భవనానికి రహదారి సౌకర్యం కల్పించాలని వెలమ సంఘ ప్రతినిధులు కోరిన వెంటనే నిధులు మంజూరు చేయించి రోడ్డు ఏర్పాటు చేసిన ఘనత కోలగట్లకే దక్కుతుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరంలో అభివృద్ధి శరవేగంగా సాగుతుందన్నారు. అభివృద్ధి చెందిన నగరాల వలే ప్రతి జంక్షన్‌ను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రజాసేవకే పరితపిస్తున్న కోలగట్లను మరోసారి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ, వెలమ సంక్షేమ సంఘం, కాపు సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

### పోలీస్ అధికారుల పాత్ర కీలకం..



రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమకు మెమెంటో అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: బాలల న్యాయ చట్టం, బాలల హక్కుల పరిరక్షణ విషయంలో పోలీసు అధికారుల పాత్రే కీలకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావుతో కలిసి ఎస్పీ ఎం.దీపికతో నిర్వహించిన నేరసమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలలపై లైంగిక వేధింపులు, మాదక ద్రవ్యాల వినియోగం, మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలను నియంత్రించడంలో పోలీసుల కృషి వెలకట్టలేనిదన్నారు. పోక్సో కేసుల్లో త్వరితగతిన విచారణ చేపట్టి బాధిత బాలలకు న్యాయం చేయాలని సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ఒక్క బాలికకు అన్యాయం జరగకుండా, హక్కులు ఉల్లంఘన కాకుండా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ జి.హిమబిందు, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలకు భరోసా సీఎం జగన్

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



నెల్లిమర్ల రూరల్: వల్లూరు ప్రధాన వీధిలో పర్యటిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భవిష్యత్ తరాలకు భరోసాగా నిలబడుతున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వల్లూరులో జగనన్నే మా భవిష్యత్.. కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుతో కలిసి ఉత్సాహంగా ఇంటింటా పర్యటించారు. వీరికి మహిళలు హారతులతో స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సంతోషంగా ఉన్నామని, పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయని మహిళలు చెప్పారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, భావితరాలకు భరోసాగా జగనన్న ఉన్నారనే ధైర్యాన్ని కల్పించే దిశగా ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలు పెట్టి స్వయం ఉపాధి కల్పించి బాసటగా నిలుస్తున్నారని చెప్పారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, ప్రజలకు జరిగిన మంచితో ఇంటింటా అపూర్వ స్వాగతం లభిస్తోందని, సంక్షేమ రాష్ట్రంగా నిలబెట్టేందుకు పాటుపడుతున్న జగన్‌కు మరలా పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు, జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

**జగనన్నే మా భవిష్యత్..**

డెంకాడ: మండలంలోని గుండాలపేటలో జగనన్నే మా భవిష్యత్.. కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి నేటి వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన ఆర్థిక ప్రయోజనాలను వివరించి, వారికి కలిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఇళ్ల యజమానుల అనుమతి మేరకు గోడలకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీటీసీ సభ్యుడు పొంతపల్లి జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగత రమణ, జేసీఎస్ కన్వీనర్ ఎస్.గౌరి, రామునాయుడు, రమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



జగనన్నే మా భవిష్యత్ ప్రచార స్టిక్కర్‌ను గోడకు అతికిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



డెంకాడ: ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

# ప్రజల ఆనందమే లక్ష్యం..



లబ్ధిదారుతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని 21వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

విజయనగరం: అన్ని వర్గాల ప్రజల ఆనందమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 21వ డివిజన్ అవనాపు వీధి నుంచి శుక్రవారం నిర్వహించి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలగట్లకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం ప్రజలందరి అదృష్టమన్నారు. మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా జగనన్న పాలన సాగిస్తున్నారని కొనియాడారు. అన్ని వర్గాలను ఆదుకును ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి పేరుగాంచారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ నాగవల్లి, కంటుభుక్త తవిటిరాజు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, కనకల గిరి, కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు




మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

నెల్లిమర్ల: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపంలో శుక్రవారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం, గ్రాడ్యుయేషన్ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంఎస్ఎన్ రాజు, ప్రిన్సిపాల్ శాంతి పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగరరావు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విజయనగరం రూరల్: విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఇంటలిజెన్స్ సీఐ ఎస్.విద్యాసాగరరావు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సహచర విద్యార్థులు శుక్రవారం ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ విద్యాసాగరరావు మాట్లాడుతూ, విద్యార్థులు సోషల్ మీడియా మాయలో పడొద్దని, ఎటువంటి దురలవాట్లకు లోనుకావద్దని హితవు పలికారు. గౌరవ అతిథిగా హాజరైన ఆర్అండ్‌బీ డీఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ, సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి ప్రస్తుతం అధిక డిమాండ్ ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎస్‌వీ రమణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



కార్యక్రమానికి హాజరైన ముస్లింలు

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని.. ఆ దిశగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ కల్యాణ మంటపంలో మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్, జేసీ మయూర్ అశోక్, ముస్లిం పెద్దలతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ.. మౌజాం, ఇమామ్‌లకు గౌరవేతనం అందిస్తున్నామని గుర్తు చేశారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పండుగే రంజాన్ అని.. అందరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ అని అన్నారు. నెలరోజుల పాటు కఠోర దీక్షతో నిష్టగా అల్లాను ఆరాధిస్తూ అత్యంత క్రమ శిక్షణతో ఆధ్యాత్మిక జీవనం కొనసాగించడం నిజంగా అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి లావణ్య, ముస్లిం పెద్దలు, వక్ఫ్‌బోర్డ్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎ.ఖరీం, జామియా మసీదు అధ్యక్షుడు ఎస్.రహీమ్, ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ బాషా, కార్పొరేటర్లు సయ్యద్ షకీల్, ఎస్.జాకీర్ హుస్సేన్, కో ఆప్షన్ సభ్యులు షేక్ రహీమ్, చోటీ మస్ జిద్ ప్రెసిడెంట్ నజీర్, ఇతర ప్రజా ప్రతినిధులు, పలువురు జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని సాగనంపుదాం..

విజయనగరం ఫూల్‌బాగ్: దేశంలో మతోన్మాద బీజేపీ, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనగా వామపక్షాల ఆలిండియా కమిటీ పిలుపు మేరకు లంకాపట్నం ప్రాంతంలో వామపక్ష నాయకులు శుక్రవారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బుగత అశోక్, రెడ్డి శంకరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా జీవితాలతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రధాని మోదీని గద్దె దించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాయి రమణమ్మ, బుగత పావని, జిల్లా సమితి సభ్యులు పొందూరు అప్పలరాజు, ఎస్. సునీల్, పట్టణ నాయకులు పొందూరు రాంబాబు, బూర వాసు.. సీపీఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, పావని, రవి, హర్ష, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.